

ఫిట్‌నెస్ తప్పనిసరి

ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడూ యాజమాన్యాలు పర్యవేక్షించాలి. వివరాలు 8లో ▸



మొలకలొచ్చిన ధాన్యం

రోజు వర్షం దంచికొడుతుండడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వివరాలు 8లో ▸



ఎందుకింత నిర్లక్ష్యం?

మున్సిపాలిటీ పరిధిలో నూతన సబ్‌స్టేషన్ మంజూరై ఏడేళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

300 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు

● జోగిపేట ఏడీఏ రమాదేవి



జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ రమాదేవి, ఆత్మకమిటీ డైరెక్టర్లు

జోగిపేట(అందోల్): జీలుగు విత్తనాల కొరత లేదని జోగిపేట ఏడీఏ రమాదేవి స్పష్టం చేశారు. ప్రస్తుతం 300 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐదెకరాలు, ఆపైన ఉన్న వారికి రెండు బస్తాలు, రెండు ఎకరాల లోపు ఉన్న వారికి ఒక్క బస్తాను పంపిణీ చేసామన్నారు. క్యూలో ఉన్న నిలబడిన రైతులకు కూపన్లు అందజేసినట్లు తెలిపారు. జీలుగు విత్తనాలకు 50 శాతం రాయితీ ఉందన్నారు. ఆందోల్, పుల్కల్, హత్నూర, వట్టిపల్లి, పరిధిలో వ్యవసాయ కార్యాలయాల్లో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీహరి, ఆత్మకమిటీ డైరెక్టర్లు, మధు, యాదయ్య, అశోక్, ఖాలేద్, శీను, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పాస్ యంత్రం ద్వారానే ఎరువులు

● డీలర్లకు ఏడీఏ నూతన్ కుమార్ సూచన



ఈ-పాస్ యంత్రాన్ని అందజేస్తున్న ఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్

నారాయణఖేడ్: రైతులకు ఎరువులను ఈ-పాస్ యంత్రాల ద్వారానే ఇవ్వాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని జూకల్ శివారులోని రైతు వేదికలో సోమవారం జరిగిన డివిజన్ పరిధిలోని ఫర్టిలైజర్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్లు ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు, నకిలీ, నాసిరకం విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు కోరమండల్ కంపెనీవారు సమకూర్చిన అండ్రాయిడ్ ఎల్-1 వెర్షన్ ఈ-పాస్ యంత్రాలను డీలర్లకు అందజేశారు. ఏడీఏ శ్రీనివాస్ ప్రసాద్, ఏవోలు శంకర్, మహేష్, వెంకటేశం, ప్రవీణ్‌చారి, హరికృష్ణ, ఆసియాబేగం, శ్రీకాంత్, రాహుల్, కోరమండల్ కంపెనీ ప్రతినిధులు ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణిలో 69 అర్జీలు

సంగారెడ్డి జోన్: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లా అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు తమ సమస్యలను అధికారుల ముందు ఉంచారు. త్వరితగతిన తమ సమస్యలు పరిష్కరించాలని అధికారుల ముందు వాపోయారు. ఈ మేరకు 69 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములను పట్టాగా మార్చేశారు

సదాశివపేట పరిధిలోని 1 81 సర్వే నంబర్‌లో ఉన్న భూమిని నిరుపేదల నుంచి సీలింగ్ భూమిని స్థానిక ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యుల పేరు మీద పట్టా భూమిగా మార్చుకున్నారని సదాశివపేట మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ ఆరోపించారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారని, సీలింగ్ భూములను పట్టా భూమిగా ఏ విధంగా మార్చారో అర్థం కావడం లేదన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం: ఎమ్మెల్యే గూడెం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మగుడి నిర్మాణానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి రూ.10 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి అన్ని విధాల సహకార అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు చంద్రారెడ్డి, హనుమత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘సాగు’దామా.. వద్దా!

రైతులకు ‘కాలం’ కలిసిరావడం లేదు. మొన్నటి వరకు అకాల వర్షాలతో అతలాకుతలమైన రైతాంగం.. ప్రస్తుతం ముందస్తు వానలు అయోమయంలో పడేస్తున్నాయి. రోహిణి కార్తెలో ఎండలు మండుతాయనుకుంటే భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కొందరు రైతులు పత్తి విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. అధికారులు మాత్రం భూమి పూర్తి స్థాయిలో తడిసిన తర్వాతనే విత్తనాలు విత్తాలని, అప్పుడే నిర్దేశిత మేర పంట దిగుబడులు ఉంటాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ముందుకు ‘సాగు’ దామా.. వద్దా అని సందేహంలో పడ్డారు.



రోళ్లు పగిలే కార్తెలో వర్షాలు

- ముందస్తుగానే రుతుపవనాలు
- ఇప్పటికే 106మి.మీ వర్షపాతం నమోదు
- విత్తనాలు విత్తడంపై రైతుల మీమాంస
- తొందరపడొద్దని వ్యవసాయ శాఖ అధికారుల సూచన

నారాయణఖేడ్: ‘రోహిణి కార్తెలో ఎండ వేడిమితో రోళ్లు పగులుతాయి’అనేది నానుడి. వేసవి కాలం చివరి అంకంలో విపరీతమైన ఉక్కపోత, వేడిమితో జనాలు ఉక్కిరి బిక్కిరి అవుతారు. ఈ సమయంలో రైతులు వేసవి దుక్కులను జోరుగా చేపడుతారు. దుక్కులు సిద్ధం చేసుకున్నాక.. మృగశిర కార్తె (మిర్గం) వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తారు. కానీ ఈసారి పరిస్థితులు అందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ‘తొందరపడి కోయిలా ముందే కూసింది’అన్న చందంగా ముందస్తుగానే భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా అంతటా ఇప్పటికే వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో రైతులు, అధికార వర్గాల నుంచి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాలకు కొందరు రైతులు పత్తి విత్తనాలు విత్తే పనులు చేపడుతుండగా.. ముందస్తుగా విత్తనాలు వేస్తే వేసవి ఎండలు కాచిన పక్షంలో విత్తనాలు చనిపోయే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. భూమి పూర్తి స్థాయిలో తడిసిన తర్వాతనే విత్తనాలు విత్తాలని, అప్పుడే నిర్దేశిత మేర పంట దిగుబడులు ఉంటాయని చెబుతున్నారు.

106మి.మీ వర్షపాతం నమోదు

ఈ వేసవిలో అకాల వర్షాలు బాగానే కురిశాయి. అవీ 19.1 మి.మీ మేరనే కురుస్తాయని అధికారులు ముందుగా అంచనా వేశారు. కానీ జిల్లాలో 106 మి.మీ వర్షపాతం ఇప్పటికే నమోదైంది. వాస్తవానికి వర్షాకాలం జూన్‌లో ప్రారంభం కాగా జూలైలోసాధారణ వర్షపాతం 120మి.మీ కురియాలి. అంటే వేసవిలోనే దాదాపు అదే స్థాయిలో వర్షపాతం నమోదైందన్న మాట. 14 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా కొండాపూర్, చౌటకూర్ మండలాల్లో అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. ఈనెల 17వ తేదీన అత్యధికంగా జిల్లాలో 29.5మి.మీ, 24న 23.7మి.మీ నమోదు కాగా జిల్లాలో 15, 16, 17, 18, 21, 23, 24 తేదీల్లో అధిక వర్షపాతం నమోదైంది.

రోహిణి రోళ్లు పగిలే కార్తె..

రోహిణి కార్తె మే 25న ప్రారంభమై జూన్ 7 వరకు విపరీతమైన ఎండలుంటాయి. అయితే.. ఈసారి ఇప్పటికే వర్షాలు కురిసి వాతావరణం పూర్తిగా చల్లబడింది. వేసవిలో రైతులు వేసవి దుక్కులు దున్నడం వల్ల భూమిలోపల ఉండే క్రిమి, కీటకాలు, వాటి గుడ్లు బయటికి వచ్చి నశించే అవకాశం ఉంది. దున్నడంతో భూమి సైతం పొరలుగా ఏర్పడి గాలి (ఆక్సిజన్) మార్పు జరుగుతుంది. తద్వారా మృగశిరలో కురిసిన వర్షాలకు భూమి బాగా తడిసి వేసిన విత్తనాలు బాగా మొలకెత్తి విత్తనం వేర్లు దెబ్బతినకుండా భూమి లోపలికి వెళ్లే ఆస్కారం ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. తద్వారా మొలక మరణించకుండా మంచి దిగుబడులు వస్తాయని, నిర్దేశిత కార్తెలోనే పంటసాగును రైతులు చేపట్టాలని చెబుతున్నారు. రోహిణి కార్తెలో విత్తనాలు విత్తిన పక్షంలో మధ్యలో ఎండలు కాచిన యెడల విత్తనం చనిపోతుందని, తర్వాత పెట్టుబడులు నష్టపోతారని పేర్కొంటున్నారు. గత ఏడాది తొలకరి వర్షాలకు పత్తి విత్తనాలు వేసిన రైతులు తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో మొలకలు వాడిపోవడం, విత్తనం చనిపోవడంతో దున్నేసి మళ్ళీ విత్తనాలు విత్తుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

అల్పపీడన ద్రోణి ప్రభావంతో..

ఈసారి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశిస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏర్పడుతున్న అల్పపీడన ద్రోణి వల్ల ఈ వర్షాలు కురుస్తున్నట్లు అంచనా. దీనికి తోడు రావాల్సిన నైరుతి ముందే కూసింది. సహజంగా జూన్ మొదటి వారంలో వచ్చే నైరుతి ఈసారి మే మధ్యస్తంలోనే పలకరించింది. జూన్ 24నాటికే కేరళను రుతుపవనాలు తాకాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇలాంటి అకాల వర్షాల కారణంగా భూసారంలో తేడా వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు గమనిస్తే సాధారణం కంటే ముందుగా వర్షాకాలం ప్రారంభమైంది. ఈ పరిస్థితుల్లో ముందుగా వర్షాలు పడి సరైన సమయంలో వర్షాలు కురియకపోతే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వానాకాలం సాగు చేసేవారు వాతావరణ మార్పులు ఎలా ఉన్నా వారి జాగ్రత్తల్లో వారు ఉండటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మూడు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని భాగాలకు రుతుపవనాలు విస్తరించనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. 16 ఏళ్ల తర్వాత నైరుతి రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా వచ్చేశాయి.



ఎస్పీని కలిసిన పదోన్నతి పొందిన ఎస్‌ఐలు

పదోన్నతితో మరింత బాధ్యత

ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతోందని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐలు కే.గంగయ్య, కే.సుధాకర్, శ్రీహరి, సంజీవ రెడ్డి, షాబుర్ రోహమాన్, ఎం.లక్ష్మీనారాయణ, దుర్గయ్య, జి.నారాయ ణ, వై.మల్లేశ్వర్, జి.భిక్షపతిలను ఎస్‌ఐలు గా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్ ఐజీ-2 సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేర కు సోమవారం ఎస్పీ కార్యాలయంలో పదో న్నతి పొందిన వారికి ఎస్‌ఐ ర్యాంక్ చిహ్నలను తొడిగి, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలలో పోలీస్ శాఖ పట్ల ఉన్న నమ్మకాన్ని, గౌరవాన్ని మరింతగా పెంచే విధంగా కృషి చేయాలన్నారు.

పోలీసు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పోలీసు అధికారుల సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఎవరి ప్రమేయం లేకుండా పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛందంగా వచ్చి అర్జీలు పెట్టుకోవచ్చని చెప్పారు. చట్ట ప్రకారం సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

మహిళ దారుణ హత్య

- నగలు, నగదుతో దుండగుల పరారీ
- న్యాల్‌కల్ మండలంలో ఘటన



రాణెమ్మ

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. నగలు, నగదుతో ఉడాయించారు. ఈ ఘటన న్యాల్‌కల్ మండల పరిధిలోని రుక్మాపూర్ లో చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంత్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోరించ రాణెమ్మ(50)కు రాయికోడ్ మండల పరిధిలోని యూసఫ్‌పూర్‌కు చెందిన మల్లేశంతో ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కూతురు ఉండగా వివాహం చేశారు. కుటుంబ తగాదాల కారణంగా భార్యాభర్తలు విడిపోయారు. దీంతో రాణెమ్మ పుట్టినిల్లు రుక్మాపూర్‌లో తల్లి వద్దే ఉంటుంది. ఈ నెల 24న తల్లి బిచ్చమ్మ హైదరాబాద్‌లో ఉంటున్న చిన్న కూతురు వద్దకు వెళ్లింది. ఒంటరిగా ఉన్న రాణెమ్మ ఎప్పటిలాగే ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుంది. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఆమెను హత్య చేసి నగలు, నగదు తీసుకొని పరారయ్యారు. సోమవారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులు చెత్త కోసం ఇంటి వద్దకు రాగా రాణెమ్మ బయటకు రాలేదు. అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూడగా రాణెమ్మ మంచంపై విగత జీవిగా పడి ఉంది. ఈ విషయాన్ని హద్నూర్ పోలీసులకు తెలిపారు. రూరల్ సీఐ ఘటనా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బదిలీలకు వేళాయె..!

సహకార సంఘం అధికారుల కసరత్తు

- ఏళ్ల తరబడి బదిలీలకు నోచుకోని సీఈఓలు, స్టాఫ్ అసిస్టెంట్‌లు
- జూన్ మొదటి వారంలో జరిగే అవకాశం



గుమ్మడిదలలోని సహకార సంఘం

సంగారెడ్డి జోన్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలలో త్వరలో బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. ఏళ్లతరబడి బదిలీలు లేకపోవడంతో ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు జరుగుతుండగా.. పీఏసీఎస్‌లో సుమారు 25 ఏళ్లుగా చేపట్టలేకపోయారు. అయితే.. బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 44 జీఓను జారీ చేసింది. త్వరలో ప్రక్రియ మొదలు పెట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సంవత్సరాలుగా ఒకే చోట విధులు

పీఏసీఎస్‌లో పనిచేస్తున్న సీఈఓలు కొన్నేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 83 సహకార సంఘాలు ఉండగా.. సంగారెడ్డి జిల్లాలో 37 ఉన్నాయి. ఆయా సహకార సంఘాలకు 83 మంది సీఈఓలు, 83 మంది స్టాఫ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఆయా సంఘాలలోని సీఈఓలతోపాటు స్టాఫ్ అసిస్టెంట్లను బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. ముందుగా సీఈఓల బదిలీలు చేపట్టాక.. స్టాఫ్ అసిస్టెంట్ల బదిలీలను చేపట్టనున్నారు. ఏళ్ల తరబడి ఒకే దగ్గర పాతుకుపోయిన వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం మూడు నుంచి ఐదేళ్లలోపు ఒకే స్థానంలో పనిచేస్తున్న వారిని బదిలీ చేపడుతున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఈ బదిలీ ప్రక్రియ వచ్చే నెలలో ప్రారంభం కానుంది.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని

సహకార సంఘాలు	83
సంఘాలలోని సీఈఓలు	83
స్టాఫ్ అసిస్టెంట్లు	83

త్వరలో సమావేశం

పీఏసీఎస్‌లో చేపట్టే బదిలీలపై త్వరలో రాష్ట్ర స్థాయిలో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. స్టేట్ లెవెల్ ఎంపవర్డ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించి బదిలీల గురించి మార్గదర్శకాలను రూపొందించనున్నారు. వాటికి అనుగుణంగా జిల్లాస్థాయి కమిటీ ద్వారా చేపడుతారు.

జిల్లాస్థాయి కమిటీలో సభ్యులు వీరే

జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసి బదిలీలు చేపట్టనున్నారు. డీసీసీబీ చైర్మన్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఈఓ, డీసీఓ, నాబార్డు డీడీఎం, డీసీసీబీ జీఎం, డీజీఎంలు కన్వీనర్లుగా వ్యవహరించనున్నారు.

సర్వేయర్ల పాత్ర కీలకం

- సాంకేతిక సర్వేపై అవగాహన పెంచుకోవాలి
- శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక సర్వేపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని మహిళా సమైఖ్య భవనంలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారంలో సర్వేయర్ల పాత్ర కీలకం అన్నారు. ప్రతి వ్యక్తికి ఆధార్ లాగా భూమికి భూధార్ ఉందని, భూమిలోని ప్రతి కమతానికి మ్యాపు కీలకం కావడంతో సర్వేయర్ల పాత్ర ఎంతో అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో భూమి క్రయవిక్రయాలు, భూమి బదలాయింపులు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సరిహద్దుల నిర్ణయంలో మ్యాపుల తయారీ తదితర విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 298 మంది లైసెన్స్ సర్వేయర్ల కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 166 మందిని మొదటి విడతలో శిక్షణ అందించామన్నారు. మిగతా 132 మందిని రెండో దశలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 50 రోజుల శిక్షణ కార్యక్రమంలో సాంప్రదాయ, నూతన టెక్నాలజీ సర్వేలను నేర్చుకోవాలన్నారు. శిక్షణ పొందుతున్న సర్వేయర్లకు స్టేషనరీ ఫైల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ఐనేష్, తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం మాతోనే సాధ్యం

- కార్మికుల హక్కులను కాపాడుతాం
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): చారిత్రాత్మక వేతన ఒప్పందం తమతోనే సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సోమవారం సదాశివపేట మండలంలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు కార్మికుల జీవితాలను మార్చే ఎన్నికలని, ఆలోచించి ఓటేయాలని ఆయన కోరారు. గతంలో కార్మికుల ఓట్లతో గెలిచిన నాయకులు వారికి మద్దతుగా నిలబడకుండా యాజమాన్యం పక్షాన చేరి కార్మికులను మోసం చేశారని మండిపడ్డారు. సీఐటీయూ వస్తేనే యాజమాన్యం మెడలు వంచి కార్మికుల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు. ఈనెల 28న జరిగే ఎన్నికల్లో చుక్క గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఎంఆర్‌ఎఫ్ యూనియన్ నాయకులు నర్సింలు, రాజు, రమేష్ రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, శివకుమార్, బాగారెడ్డి, రేవనప్ప, వెంకటేశం, హాజీ, పరశురాం, మల్లేశం, నాయకులు సాయిలు, యాదగిరి, మాణిక్యం, జయరాజ్ పాల్గొన్నారు.

రైతు నేస్తం మరింత విస్తృతం

ప్రతి మండలానికి రెండు కొత్త వీడియో కాన్ఫరెన్స్ సామగ్రి

- మొత్తం 68 కేంద్రాల్లో అందుబాటులోకి..
- రైతులకు మరింత చేరువలో సమాచారం



రంజోల్ రైతు వేదికలో అందుబాటులోకి వచ్చిన వీడియో కాన్ఫరెన్స్

జహీరాబాద్: శాస్త్ర సాంకేతికను క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లేందుకు రైతు నేస్తం కార్యక్రమాన్ని మరింత విస్తృత పర్చేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ చేపట్టింది. ఇందు కోసం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించేందుకు జిల్లాలోని ప్రతి మండలానికి కొత్తగా రెండు చొప్పున సామగ్రిని సమకూర్చింది. ప్రస్తుతం ప్రతి మండలానికి ఒక యూనిట్ మాత్రమే ఉంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు అందించే సమాచారం, సూచనలు, సలహాలు పొందేందుకు రైతులు వెళుతున్నారు. అయితే.. మారుమూల గ్రామాల్లో ఉండే రైతువేదికల వద్దకు మండలంలోని రైతులు అంతా వెళ్లాల్సి వస్తోంది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణా సదుపాయం అందుబాటులో లేక వీడియో కాన్ఫరెన్స్‌లను ఉపయోగించుకోలేక పోతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్‌ల సంఖ్య పెంచింది. ప్రస్తుతం జిల్లాలో 116 రైతు వేదికలు ఉన్నాయి. మొదటి విడతలో 6, రెండో విడతలో 19, తాజాగా మరో 43 మంజూరు కావడంతో మొత్తం 68 వీడియో కాన్ఫరెన్స్‌లు అందుబాటులోకి వచ్చాయి.

ప్రతి వారం శాస్త్రవేత్తలతో అవగాహన

ప్రతి మంగళ వారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. విత్తనాలు వేసే సమయంలో ఎలాంటి విత్తనాలను ఎంపిక చేసుకోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారు. పంట మొలకెత్తాక తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందులు తదితర అంశాలపై వివిధ దశల్లో సూచనలను అందిస్తారు. రైతులు తమ అనుమానాలను నివృత్తి చేసుకుంటారు. విత్తనం నాటినప్పటి నుంచి పంట కోతకు వచ్చే వరకు ప్రతి వారం వ్యవసాయం, ఉద్యాన పంటలపై రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన పొందనున్నారు.

రైతులకు ఉపయోగకరం



ప్రతి మండలానికి కొత్తగా రెండు వీడియో కాన్ఫరెన్స్‌లను అదనంగా అందుబాటులోకి తీసుకొచ్చాం. దీంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలి. ఆర్థికంగా అభివృద్ధి చెందాలి.

– భిక్షపతి, ఏడీఏ-జహీరాబాద్

మూడో అంతస్తుపై నుంచి పడి బాలుడు మృతి

● తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘటన



బాలుడి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: భవనంపై నుంచి పడి బాలుడు మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మధ్యప్రదేశ్‌కి చెందిన రూప్ చంద్ బతుకుదెరువు కోసం భార్య సత్యశీల, ముగ్గురు పిల్లలతో కలిసి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలమెల సమీపంలోని అభినందన కన్‌స్ట్రక్షన్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ అక్కడే క్యాంపులో ఉంటున్నాడు. సోమవారం ఉదయం నిర్మాణ దశలో ఉన్న భవనం వద్దకు చిన్న కుమారుడైన లవ్(3)ను తీసుకొని వెళ్లాడు. మూడో అంతస్తులో భార్యాభర్తలు పని చేస్తున్న క్రమంలో లవ్ ఆడుకుంటూ వెళ్లి మూడో అంతస్తుపై నుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన బాలుడిని చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాలుడి తండ్రి రూప్ చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మృతి చెందిన గేదె

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఇసుపకాయ తండాలో సోమవారం ఉదయం విద్యుదాఘాతానికి గేదె మృతి చెందింది. తండాకు చెందిన దేవసోత్ రమేశ్‌కు చెందిన గేదె పంట పొలానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.70 వేల నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

కద్పల్‌లో మరో గేదె

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కద్పల్‌లో సోమవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెంది. గ్రామానికి చెందిన రైతు భద్రరెడ్డి సమీపంలో పశువులను మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి రూ.60 వేల విలువైన గేదె మృతి చెందింది. ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని బాధితుడు కోరారు.

గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు కేసీఆర్‌నగర్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు చెందిన కరీం, ఇర్షాద్ కలిసి వారికి పరిచయమున్న జాకీర్ ద్వారా మహారాష్ట్రలోని ఘటనందూర్‌కు 20న వెళ్లారు. అక్కడ వసీం, అంజాద్ దగ్గర నుంచి 42 ప్యాకెట్‌ల గంజాయిను కొనుగోలు చేశారు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చి బోరబండలో 19 ప్యాకెట్ల గంజాయిను విక్రయించారు. అక్కడ నుంచి కొల్లూర్ కేసీఆర్ నగర్‌లో 3 ప్యాకెట్ల గంజాయిను విక్రయించారు. తిరిగి ఆదివారం రాత్రి మిగిలిన గంజాయిను విక్రయించేందుకు కేసీఆర్‌నగర్‌కు వచ్చారు. కచ్చితమైన సమాచారం మేరకు కరీం, ఇర్షాద్‌ను కొల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 111 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాసాయిపేట శివారులో సోమవారం వెలుగు చూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నర్సింలు కథనం మేరకు.. మేడ్చల్ జిల్లా శ్రీరంగవరానికి చెందిన అంతొల్ల రాజశేఖర్(32) మాసాయిపేటకు వివాహ వేడుకకు వచ్చాడు. రాజశేఖర్ ఆదివారం రాత్రి మద్యం సేవించి భార్యతోపాటు వివాహ వేడుకకు హాజరైన బంధువులతో గొడవపడి అదే రాత్రి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం మాసాయిపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై రాజశేఖర్ మృతదేహం గుర్తించిన స్థానికులు కుటుంబీకులకు, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించగా మద్యం సేవించి రాత్రి జరిగిన గొడవను దృష్టిలో ఉంచుకొని రాజశేఖర్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చనని గ్రామస్తులు రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గొర్రెలు చోరీ

శివ్వంపేట(నర్సాపూర్) : గొర్రెలు చోరీ అయిన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇసుగారి మల్లేశ్ రోజువారిగానే గొర్రెలను పాకలో ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 5 గొర్రెలను ఎత్తుకెళ్లారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదే గ్రామంలో ఇళ్ల ఎదుట పార్క్ చేసిన పలు ద్విచక్ర వాహనాల్లో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు చోరీ చేశారు.

ఫిట్‌నెస్ తప్పనిసరి

స్కూల్ బస్సుల యజమానులకు అధికారుల హెచ్చరిక

- జూన్ 12వ తేదీన విద్యాసంస్థలు ప్రారంభం
- ఇప్పటి వరకు ఫిట్‌నెస్ చేయించుకున్న 350 ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు
- ఇంకా రావాల్సి ఉన్న 350
- నియమ నిబంధనలు పాటించాలని సూచనలు



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారి



ఫిట్‌నెస్ పరీక్ష చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయరావు

పటాన్‌చెరు టౌన్: ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడూ సంబంధిత యాజమాన్యాలు పర్యవేక్షించాలి. జూన్ 12వ తేదీన విద్యాసంస్థలు ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపే బస్సులకు మళ్లీ ఫిట్ నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఇప్పటి వరకు ఆర్టీవో కార్యాలయంలో వివిధ స్కూళ్లకు చెందిన 350 బస్సులకు ఫిట్‌నెస్ చేసి సర్టిఫికెట్ అందజేశారు. అయితే ఇంకా 350 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉందని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

ఫిట్‌నెస్‌కు వస్తున్న బస్సులు

పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం సమీపంలోని రవాణా శాఖ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, బొల్లారం, గుమ్మడిదల మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన స్కూళ్ల బస్సులకు ఫిట్ నెస్ చేయించుకుంటాయి. ప్రతీ ఏడాది స్కూల్ ప్రారంభానికి ముందు ఆర్టీవో కార్యాలయానికి వచ్చి బస్సులను ఫిట్ నెస్ చేయిస్తారు. ఫిట్‌నెస్ లేకుండా పాఠశాలల బస్సులు తిరిగితే సీజ్ చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు స్కూళ్లలో విద్యార్థుల నమోదును పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. విద్యార్థులను నేరుగా ఇంటి నుంచి తీసుకెళ్లి.. తిరిగి సాయంత్రం ఇంటి వద్ద విడిచి పెడతామని చెబుతున్నారు. పట్టణంలో, మండలంలో ఉండే విద్యార్థులు కోసం ప్రైవేట్ పాఠశాలల వారు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి బస్సు రవాణా చార్జీలు వసూలు చేస్తున్నారు.

పాటించాల్సిన నిబంధనలు

- విద్యా సంస్థల బస్సులు విధిగా పసుపు రంగులోనే ఉండాలి.
- బస్సులో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకోవద్దు.
- బస్సు నడిపే డ్రైవర్‌కు హెవీ వెహికల్ లైసెన్స్ ఉండాలి. అదే విధంగా డ్రైవర్ వయసు 55 ఏళ్లలోపు ఉండాలి. బస్సు నడిపేందుకు ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి.
- మద్యం తాగి వాహనం నడిపితే లైసెన్స్ రద్దు అవుతుంది.
- పాఠశాలల బస్సు పదిహేనేళ్ల కాలపరిమితి దాట కూడదు
- కుడి ఎడమవైపు పాఠశాలల పేరు చిరునామా స్పష్టంగా రాయాలి.
- డ్రైవర్ లైసెన్స్‌ను పాఠశాల యాజమాన్యం విధిగా ఆర్టీఏ కార్యాలయంలో అందించాలి.
- బస్సులో ప్రథమ చికిత్స కిట్టు, ఫైర్‌కు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉండాలి.
- అత్యవసర ద్వారం ఉండాలి, బస్సు డ్రైవర్ అటెండర్ ఫోన్ నంబర్లు విధిగా ఉంచాలి.
- నెలకు ఒకసారి బస్సు డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి పరీక్షలు విధిగా చేయించాలి.
- డ్రైవర్, అటెండర్‌కు కచ్చితంగా యూనిఫామ్ ధరించాలి.
- విద్యార్థులను స్కూలుకు తీసుకెళ్లే సమయంలో తిరిగి ఇంటి వద్ద వదిలే సమయంలో విద్యార్థులందరూ బస్సు దిగారా లేదా చూసుకోవాలి.అలాగే రోడ్డు దాటించాల్సిన వస్తే వారిని దాటించాలి.

ఫిట్‌నెస్ లేని బస్సులు సీజ్ చేస్తాం



ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలి. పటాన్‌చెరు రవాణా శాఖ కార్యాలయంలో ఇప్పటి వరకు 350 వివిధ విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ చేశాం. మిగితా 350 బస్సులకు ఫిట్‌నెస్‌కు రావాల్సి ఉంది. జూన్ 12వ తేదీ పాఠశాలలు ప్రారంభం నేపథ్యంలో ముందుగానే బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకోవాలి. ఫిట్‌నెస్ లేకుండా రోడ్ల పై తిరిగితే బస్సులను సీజ్ చేయడంతోపాటు చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటాం.

– విజయరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

పరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటా..

- లంచం ఇవ్వలేని దుస్థితి నాది
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుడి నిరసన



మాట్లాడుతున్న సంపత్

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టులో తమ భూమి ముంపునకు గురైందని, దానికి పరిహారం ఇవ్వాలని కొన్ని నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని నిరసిస్తూ సోమవారం అక్కన్నపేట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట యువకుడు నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన నందారపు వెంకటయ్య కుమారుడు సంపత్‌కి చెందిన ఎకరం 10 గుంట భూమి 2016–17లోనే ప్రాజెక్టులో మునిగిపోయింది. అప్పటి నుంచి పరిహారం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. 2024 డిసెంబర్ 31న కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేయడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణకు ఆదేశించి న్యాయం చేస్తామని భరోసాను కల్పించారు. దీంతో రెవెన్యూ అధికారులు కదిలొచ్చి మోకా విచారణ చేశారని, ప్రాజెక్టు కట్ట నిర్మాణానికి భూమిని వాడుకున్నట్లు తేల్చారు. ఓ రెవెన్యూ అధికారి రూ.50 వేలు లంచం తీసుకొని తనకు రావాల్సిన రూ.14లక్షల నష్టపరిహారం ఇతరులకు ఇచ్చారని బాధితుడు వాపోయాడు. కార్యాలయానికి తాను ఎప్పుడు వచ్చిన రేపు మాపు రావాలంటూ కాల్లం వెళ్లదీస్తున్నారే తప్ప న్యాయం చేయడం లేదని కంటతడి పెట్టుకున్నారు. లంచం ఇచ్చే స్థోమత లేదని, ఇకనైనా న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వాపోయాడు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నాం

- కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంటాం
- అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్న బాధిత కుటుంబం



కలెక్టరేట్ వద్ద కుటుంబీకులతో శేఖర్

మెదక్ కలెక్టరేట్: మైక్రో ఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేక పోతున్నాం.. వారి నుంచి రక్షించకుంటే మా కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమంటూ ఓ కుటుంబం కన్నీటి పర్యంతమైంది. ఈ మేరకు సోమవారం తమను కాపాడాలంటూ అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొడిపల్లి మండలం సలాబత్‌పూర్‌కు చెందిన శేఖర్ రోజువారి కూలీ పనులు చేసుకుంటూ భార్యతోపాటు ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. అవసరం కోసం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రూపు సభ్యులతో కలిసి ఓ మైక్రో ఫైనాన్స్ బంధన్ బ్యాంకులో గతేడాది క్రితం రూ.1.10 లక్షలు అప్పు తీసుకున్నాను. భార్యాభర్తల అనారోగ్యం కారణంగా ఆర్థిక సమస్య ఏర్పడింది. అప్పు వాయిదాలు కట్టేందుకు ఫిన్‌కేర్‌లో రూ.50 వేలు, మళ్లీ డీసీబీ ప్రైవేట్ బ్యాంకులో రూ.60 వేలు, టాటా క్యాపిటల్ బ్యాంకులో రూ.50 వేల అప్పు తీసుకున్నాడు. ఆరోగ్యం సహకరించకపోయినా కష్టపడి వాయిదాలు కడుతూనే ఉన్నాడు. ఒక్క వాయిదా ఆలస్యమైనా గ్రూప్ సభ్యులను ఇంటికి పంపి ఇంటికి తాళం వేస్తామంటూ బెదిరిస్తున్నారు. రోజు రోజుకూ వేధింపులు ఎక్కువయ్యాయని కలెక్టర్ స్పందించి న్యాయం చేయకుంటే మా కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని కుటుంబమంతా కన్నీటి పర్యంతమయ్యారు. స్పందించిన అదనపు కలెక్టర్ నగేశ్ సమస్య పరిష్కరించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు.

చర్చికి వెళ్లి మహిళ అదృశ్యం



అనూష

మెదక్ మున్సిపాలిటీ: సీఎస్ఐ చర్చి చూసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన మహిళ అదృశ్యమైంది. మెదక్ పట్టణ సీఐ నాగరాజు కథనం మేరకు.. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన గుంజి అనూష 18న మెదక్‌లోని సీఎస్ఐ చర్చి చూసేందుకు వచ్చింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో 20న ఆమె భర్త వెంకట ప్రసాద్ మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఎస్ఐ చర్చిలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. అనూష మరో ఇద్దరు మహిళలతో కలిసి వెళ్లినట్లు గుర్తించారు. వారిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తూ కసు చేస్తున్నారు. మహిళలను ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి ఆటో డ్రైవర్



నవీన్‌కుమార్

రామాయంపేట(మెదక్): ఇంటి నుంచి వెళ్లి ఆటో డ్రైవర్ అదృశ్యమయ్యాడు. పోలీసులు కథనం మేరకు.. రామాయంపేట పట్టణానికి చెందిన కొండ నవీన్‌కుమార్ ఆటోను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. నవీన్‌కుమార్ భార్య రాజశ్రీ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కేసు నమోదు చేశారు.

డ్రగ్స్ వినియోగాన్ని అంతం చేయాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్
- అధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న అబ్దుల్ హమీద్

సిద్దిపేటరూరల్: జిల్లాలో డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని పూర్తి స్థాయిలో అంతం చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడి నుంచి డ్రగ్స్ సరఫరా జరుగుతుందో ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సోషల్ మీడియా, విద్యా సంస్థల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్ వినియోగించినా, సరఫరా చేసిన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రాజీవ్ రహదారి వెంట ఉన్న అనధికార డివైడర్‌లు, గ్రామాల నుంచి రహదారులను కలిసే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై ధాన్యాన్ని అరబెట్టొదన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ శాంతి, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్, రహదారి, ట్రాఫిక్, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు



నిఖిల్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): బైక్‌ను లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన రామాయంపేట వద్ద చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన ఇద్దరు స్నేహితులు బూస నిఖిల్ (24), మల్లాపురం నితీశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. శనివారం ఇద్దరూ స్వగ్రామానికి వచ్చారు. సోమవారం బైక్‌పై మళ్లీ హైదరాబాద్ వెళ్తుండగా రామాయంపేట వద్దకు రాగానే అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన నితీశ్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. మృతుడు నిఖిల్ తండ్రి లింబాద్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు, బైక్ ఢీ : యువకులకు గాయాలు



గాయాలతో యువకులు

దుబ్బాకరూరల్: కారు బైక్‌ను ఢీకొట్టడంతో యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డిపేట వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. పోతారెడ్డి పేట గ్రామానికి చెందిన రాజు, స్వామి, మణికంఠ డబుల్ బెడ్ రూం ఇళ్ల నుంచి గ్రామంలోకి వెళ్తున్నారు. సిద్దిపేట వైపు నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకులకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ



బోల్తా పడిన ట్రాక్టర్

చిన్నశంకరంపేట(మెదక్): ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానిక పరిశ్రమ నుంచి స్టీల్ లోడ్ చేసుకొని పెట్రోల్ పంపు వద్దకు వచ్చిన లారీ నిలిపి ఉన్న ట్రాక్టర్ ఇంజన్‌ను ఢీకొట్టింది. ఈ సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన ఉండటంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్‌ను కొద్ది దూరం లాక్కెళ్లడంతో మెదక్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ధాన్యం కుప్పను ఢీకొని గాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను బైక్‌తో ఢీకొట్టడంతో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మెల్లూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మెల్లూర్ గ్రామానికి చెందిన దాసరి కిరణ్(30) సోమవారం రాత్రి పని నిమిత్తం బైక్‌పై వెల్దుర్తి వెళ్తున్నాడు. వెల్దుర్తి–మెల్లూర్ గ్రామ శివారులో బీటీ రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



బోల్తా పడిన ట్రాక్టర్

ధాన్యం లోడ్ ట్రాక్టర్ బోల్తా

వర్గల్(గజ్వేల్): రోడ్డు మధ్య భారీ గుంతలతో ధాన్యపు లోడ్ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం వర్గల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఇటీవలె వర్షాలకు వర్గల్ తహసీల్దార్ కార్యాలయం ముందర ప్రధాన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షపు నీటితో నిండిపోవడంతో గుంతలు గుర్తించే అవకాశం లేకుండా పోయింది. సోమవారం సాయంత్రం గౌరారం వైపు నుంచి మాధవరెడ్డి అనే రైతుకు చెందిన 118 ధాన్యపు బస్తాల లోడ్‌తో ట్రాక్టర్ వర్గల్ పారిశ్రామికవాడలోని రైస్‌మిల్‌కు వెళ్తుంది. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గుంతల కారణంగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు.

విద్య, సామాజిక సేవా రంగంలో విశేష కృషి

ధర్మాజీపేట హైస్కూల్ హెచ్‌ఎం సాదత్ అలీకి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సాదత్ అలీ

దుబ్బాక : విద్య–సామాజిక సేవా రంగంలో విశేషంగా కృషి చేస్తున్న దుబ్బాక మున్సిపల్‌లోని ధర్మాజీపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మహమ్మద్ సాదత్ అలీ గౌరవ డాక్టరేట్ దక్కింది. సోమవారం ఎమర్జింగ్ అచీవర్స్ అవార్డు న్యూఢిల్లీ ఆధ్వర్యంలో కానిస్టిట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు నరేశ్ బన్సల్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. సాదత్ అలీ 20 ఏళ్లు భౌతిక, రసాయన శాస్త్రంలో కృత్యాలు, లోక్యాస్ట్ నో క్యాస్ట్ ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం ధర్మాజీపేట హైస్కూల్‌లో భౌతిక రసాయన శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎంగా, డీఆర్పీగా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా అలీని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

మొలకలొచ్చిన ధాన్యం.. రైతులు ఆగం

- వానలు వస్తుండటంతో కాపాడుకునేందుకు పడరాని పాట్లు
- జిల్లాలో 90 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి
- ఇంకా కేంద్రాల్లో 80 వేల టన్నులకు పైగా ధాన్యం
- త్వరగా కొనుగోలు చేయాలంటూ వేడుకోలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు గుమ్మడిదల లక్ష్మి. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ గ్రామం. 15 రోజుల కిందట వరి పంట కోసి వడ్లు కొనుగోలు కేంద్రంలో పోసింది. వానకు వడ్లు తడిసి మొలకలొచ్చాయి. ఎంత ప్రయత్నించినా ధాన్యంను కాపాడుకోలేకపోతున్నానని ఎండిన వడ్లు తడిసి మళ్లీ మొలకలు వచ్చినయి ఏం జెయాల్నో తోస్తలేదంటు మొలకలొచ్చిన ధాన్యం చూపిస్తూ లక్ష్మి కన్నీరు పెట్టింది. ఇది ఒక్క లక్ష్మిదే కాదు జిల్లాలోని చాలా మంది రైతులది ఇదే గోస.



చేర్వాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం

దుబ్బాక : రైతులు ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట అమ్ముకునేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తుంది. రైతుల మీద పగబట్టినట్లుగా రోజు వర్షం దంచికొడుతుండడంతో ధాన్యం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వానలకు ఎండిన వడ్లు తడవడంతో కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ చూసిన మొలకలొచ్చిన వడ్లనే చూపిస్తూ రైతులు కన్నీరు పెడుతున్నారు.

3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ఈ యాసంగిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అకాల వర్షాలతో ఇబ్బందిగా తయారైంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవడం, వరదలో కొట్టుకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. నేటి వరకు జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాల ద్వారా దొడ్డు రకం ధాన్యం 3.30 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు జరుగగా, సన్నరకం కేవలం 470 మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగింది. ఇప్పటి వరకు 90 శాతం వరకు కొనుగోలు పూర్తి అయ్యిందని ఇంకా 10 శాతం లోపు 80 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉంటుందని అధికారుల అంచనా వేశారు.

వడ్లు మొలకలొచ్చినయ్..



15 రోజుల నుంచి వానకు తడవడం మళ్లీ ఎండబోయడం ఇదే పని. తడిసిపోయి వడ్లు మొలకలొచ్చినయ్ ఏం జేయాలో తోస్తలేదు. మొలకలొచ్చిన వడ్లను వేరు చేస్తూ కవర్‌లలో ఎండబోయడం మళ్లీ కుప్పజేయడం ఇదే పని.అందరివి మొలకలు వచ్చినయ్. కుప్పలు జేసిన వానకు వరద వచ్చి కిందనుంచి మొలకలు వస్తున్నాయి. వెంటనే కొనకుంటే ధాన్యం చేతికిరాకుండా పోతుంది.

– మూర్తి బాపురెడ్డి, రైతు

వర్షాలతో ఇబ్బందిగా తయారైంది



వర్షాలతో ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది తయారైంది. రోజు వర్షం కురుస్తుండటంతో ఎండిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వానలు లేకుంటే ఇప్పటి వరకు కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేది. కేంద్రాల్లో మిగిలిన ధాన్యం త్వరగా కొనుగోలుకు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం

– రాధిక, జిల్లా వ్యవసాయ అధికారి